క్లుప్తంగా

పండ్లు పంపిణీ



జామియా మసీదులో ముస్లింలకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

ఆదోని అర్బన్ : పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని ఉపవాసదీక్ష చేస్తున్న ముస్లింలకు డీఎస్పీ వినోద్‌కుమార్ శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ముందుగా వన్‌టౌన్ సీఐ విక్రమసింహతో కలిసి మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సాయంత్రం ముస్లింలకు కర్జూర పండ్లు అందజేశారు. పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు.

53 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లు చేయించుకున్న వారితో అవోపా సంఘం సభ్యులు

ఆదోని అర్బన్ : ఆదోని అవోపా అండ్ అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి పరీక్షల్లో భాగంగా 53 మందికి ఉచిత కంటి శుక్లము ఆపరేషన్లు చేయించినట్లు అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్త, సెక్రటరీ మిరియాల శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆపరేషన్లు చేయించుకుని ఆదోనికి వచ్చిన వారికి విజయోత్సవ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 53 మంది ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా ఉచితంగా కంటి శుక్లము ఆపరేషన్, వసతి, అద్దాలు, మందులు, రవాణా సౌకర్యం అవోపా అండ్ కర్నూలు విశ్వభారతి ఆస్పత్రి సౌజన్యంతో కల్పించామని చెప్పారు. ప్రతాప్, ఈరన్న, టీజీ శ్రీనివాస్, టీజీ రాంప్రసాద్, మహిళా విభాగ్ ప్రెసిడెంట్, సెక్రటరీ, సంగీత, మమతా, బిందు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



మద్యం, నిందితులను చూపుతున్న పోలీసులు

ఆదోని రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని మండలంలోని హానవాల్ ఎల్లెల్సీ కాలువ వద్ద అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆదోని పట్టణం బోయగేరికి చెందిన బోయ ఉదయ్‌కుమార్, బోయ అంజిని, బోయ నరసింహ మోటార్ సైకిల్ (ఏపీ21బీజే 9103)పై 170 ఒరిజినల్ చాయిస్ (90ఎం.ఎల్.) తీసుకొస్తుండగా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఏఎస్‌ఐ వెంకటరమణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఏపీ నుంచి కర్ణాటకకు రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ కిరణ్ స్వాధీనం చేసుకున్నారు. బొలేరో వాహనంలో సుమారు 60 ప్యాకెట్లలో దాదాపు 3 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించి తుంగభద్ర గ్రామానికి చెందిన నాగేంద్ర, రాయచూర్‌కు చెందిన గురుస్వామి, భరత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

హెల్త్ సెంటర్‌లో అన్ని రకాల వైద్యం

కౌతాళం: హెల్త్ సబ్‌సెంటర్‌లో అత్యాధునిక సదుపాయాలతో వైద్య సేవలందుబాటులో ఉన్నాయని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆయుషా తెలిపారు. మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు, ఆశా వర్కర్లు, వలంటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సబ్ సెంటర్లల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిందని గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవల్ని ఉపయోగించుకోవాలని కోరారు. అత్యాధునిక సేవల్లో భాగంగా ఇప్పటికే కంప్యూటరీకరణ కూడా పూర్తి చేశారన్నారు. ఎంపీటీసీ లింగన్నగౌడ్, ఉప సర్పంచ్ నాగేష్, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ పథకాన్ని కొనసాగిస్తాం

కర్నూలు కల్చరల్: నారాయణ అన్నప్రసాద వితరణ పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మిత్రమండలి కోర్ కమిటీ సమావేశం జరిగింది. బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి రిజిస్ట్రేషన్ అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అన్నప్రసాద వితరణ పథకం అమలు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే సభ్యత్వాలు స్వీకరించి సభ్యులను చేర్చుకోవాలని, ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్‌ను కలిసి కార్యక్రమానికి తగిన వసతి కొరకు వినతిపత్రం అందజేయాలని తీర్మాణించారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ బోయశాంత, అధికారులు



అదోనిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి



అదోనిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ జయంతి వేడుకలు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. రాజ్యాంగం రూపొందించి నేడు అన్నివర్గాల ప్రజలకు ఫలాలను అందించిన ఘనత ఆయనదేనని చెప్పారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి పాతబస్టాండు సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో అంబేడ్కర్ ప్రతిపాదించిన మేరకు అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయశాంత, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవదాస్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు మునీర్, సంజీవ్, నరసింహులు, గౌస్, గోవిందరాజులు, కుంకనూరు వీరేష్, చలపతి, గోవిందు, చిన్నా, అశోక్, కృష్ణమూర్తి, గంగాధర్, రామకృష్ణ, తాయన్న, నారాయణ, శ్రీలక్ష్మి, కల్పవల్లి, సుగుణ మ్మ పాల్గొన్నారు.

ఆదోని అర్బన్ : పట్టణంలోని అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా పార్టీలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారుల్లో అంబేడ్కర్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి తిక్కస్వామిదర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, కోట్ల కూడలి, పాత బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ఊరేగింపు చేపట్టారు. అలాగే ఒంటెలపై ర్యాలీ నిర్వహించారు. కుమార్, వినయ్, వెంకీ, నందా, ప్రేమ్, సురేష్, నాగరాజ్, జైశంకర్, నరసింహ, లోకేష్, ఉమేష్, అశోక్,భాస్కర్ పాల్గొన్నారు. ఫెయిత్‌హోమ్‌లోనున్న విద్యార్థులకు ఎస్టీయూ నాయకులు అన్నదానం చేశారు.

ఆదోని రూరల్: అట్టడుగు వర్గాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. దేశ భవిష్యత్ అవసరాలను ముందే ఊహించి, వాటి పరిష్కార మార్గాలను రాజ్యాంగంలో పొందుపరిచిన దార్శనికుడన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా, రీ సర్వే ఉప తహసీల్దార్ పెద్దయ్య, సీనియర్ సహాయకులు రామచంద్ర, జూనియర్ సహాయకులు మల్లికార్జున, వీఆర్వోలు హనుమంతరావు, రాజశేఖర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి.ఆర్.స్వామి, జిల్లా అధ్యక్షుడు జైభీమ్ సాయిరామ్, పట్టణాధ్యక్షుడు బొబ్బిలి, కుమారస్వామి పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వై.ప్రదీప్‌రెడ్డిని జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జానయ్య పూలమాల వేసి సన్మానించారు. అంతకు ముందు ఎమ్మార్పీఎస్ అంబేడ్కర్ యూత్, కేవీపీఎస్ మండల నాయకులు అనిల్, జయరాజు ఆధ్వర్యంలో ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, మాధవరం రామాకృష్ణారెడ్డి, అల్‌ఫ్రెడ్‌రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయసలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర తదితరులు ఉన్నారు. అలాగే.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు, మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కిరణ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఆనంద్ నివాళులర్పించారు. సుంకేశ్వరి గ్రామంలో అమ్రేష్ రాజ్యాంగం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర కో ఆర్డినేటర్ మలికల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల లక్ష్మినారయణ ఆధ్వర్యంలో బీఎస్పీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. జిల్లా అధ్యక్షుడు బైరాజు, జిల్లా ఇన్‌ఛార్జ్ అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సామెల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, మంత్రాలయం నియోజక వర్గ అధ్యక్షుడు మోహన్‌కుమార్ ఉన్నారు.

కోసిగి: అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకుందామని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళుర్పించారు. అలాగే ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక నడిమి పాలెం ఎస్సీ కాలనీ నుంచి అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు. చింతకుంట గ్రామంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఈరన్న, మాణిక్యరాజు, మాజీ సర్పంచ్ యల్లయ్య, అర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, వక్రాని వెంకటేష్ పాల్గొన్నారు.

కౌతాళం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సర్కిల్‌లోనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మండలంలోని వివిధ దళిత సంఘాల నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో మల్లయ్య, దళిత సమాఖ్య ఆధ్వర్యంలో ప్రకాశ్, తిమోతి, బాషా, మోకేష్ నివాళులర్పించారు. సర్పంచ్ పాల్‌దినకరన్, మాజీ సర్పంచ్ అవతారం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహల్లద చారి, బాపురంలో సర్పంచ్ శిల్ప, ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, నాయకులు గురునాథ్‌రెడ్డి, జెపాల్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పెద్దకడబూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో అంబేడ్కర్ జయంతిని జరుపుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణప్ప ఆధ్వర్యంలో ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళలర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో ఆర్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో, సచివాలయం - 2లో సర్పంచ్ రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజు నివాళలర్పించారు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పరమేష్, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న పాల్గొన్నారు.

కౌతాళం: అంబేడ్కర్ అందరి నాయకుడని ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని ఆవాజ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఇసాక్, మాజీ మండల అధ్యక్షుడు దూద్‌బాషా అన్నారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆసీఫు హుసేన్, అబ్దుల్‌షుకూర్, సమద్, తాహెర్, ఫారుక్ పాల్గొన్నారు.



పెద్దకడబూరులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



కౌతాళంలో తహసీల్దారు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి



కౌతాళంపోలీస్‌స్టేషన్‌లో నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ సిబ్బంది



కోసిగిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం



అదోనిలో ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

వైభవంగా విషు మహోత్సవ పూజలు



ప్రత్యేకంగా అలంకరించిన అయ్యప్ప స్వామి పడి



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. శుక్రవారం భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సాయంత్రం పూలంకి సేవ, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. శేషు యాదవ్ బ్రదర్స్‌చే నిర్వహించిన భజన అలరించింది. అల్పాహార ప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులురమేష్ గురుస్వామి, మధుసూదనరెడ్డి గురుస్వామి, ఆర్వేటి భాస్కర్, భూషణ్ గౌడ్ పాల్గొన్నారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. పడి పూజ, పూలంకి సేవలు విశేషంగా నిర్వహించారు. జయశేఖర్, సోమశేఖర్ గురుస్వామిల బృందంచే నిర్వహించిన అయ్యప్ప భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సుగంధ జలాభిషేకం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి మేష సంక్రమణంను పురస్కరించుకొని సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు సుగంధ జలాభిషేకం, విశేష పూజలు, నక్షత్ర హారతి, వేద స్వస్తి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



సూర్యనారాయణ స్వామికి నక్షత్ర హారతి ఇస్తున్న పండితులు

16 నుంచి ధరిత్రి వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: భారత ప్రభుత్వ పృథ్వీ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు ప్రపంచ ధరిత్రి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం కర్నూలు నగరంలోని వీఆర్ కాలనీలోని నైస్ సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి కలవారు ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారికి ఈ నెల 21న సన్మానం ఉంటుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేసిన కార్యక్రమాల వివరాలతో కూడిన బయోడేటాను ఈనెల 16వ తేదీలోగా నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

జగన్‌తోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి



పల్లెపాడులో మహిళా రైతుకు జగనన్న పాలన గురించి వివరిస్తున్న దృశ్యం

కోసిగి: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాలని గృహసారథుల మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి టీడీపీ, ప్రస్తుతం జగనన్న పాలనలోని తేడాలను వివరించారు. మద్దతు తెలిపిన వారి నుంచి 8296082960కు మిస్డ్‌కాల్ ఇప్పించారు. అనంతరం ఇళ్లకు స్టిక్కరు అతించారు. అలాగే కోసిగి సచివాలయం-2 పరిధిలో ఎంపీపీ ఈరన్న కార్యక్రమం నిర్వహించారు.

జవాబుదారీగా పనిచేయాలి



రామళ్లకోట గ్రామసభలో మాట్లాడుతున్న డీపీఓ

వెల్దుర్తి: ఏ చిన్న అవసరానికైనా ప్రజలు పంచాయతీ కార్యాలయానికి, సచివాలయానికి వచ్చినపుడు సంబంధిత అధికారులు జవాబుదారీగా ఉండి వారి సమస్య తీర్చేందుకు బాధ్యతగా పనిచేయాలని డీపీఓ నాగరాజు నాయుడు సూచించారు. శుక్రవారం ఆయన రామళ్లకోట పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు డీఎల్‌పీఓ తిమ్మక్కతో కలిసి హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు, సర్పంచ్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, బీటీ నాయుడు తదితరులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించి, సమస్యలపై చర్చించి పరిష్కరించుకునేందుకు గ్రామసభలు నిత్యం నిర్వహించాలన్నారు. గ్రామాలలో అసాంఘిక, దురాచారాలను రూపుమాపే దిశగా ఉద్యోగులు కృషిచేయాలన్నారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు. వెల్దుర్తి మేజర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై సెబ్ ఉక్కుపాదం

- ఏడాదిలో 420 కేసులు నమోదు
- 538 మంది అరెస్ట్, 118 వాహనాలు సీజ్
- వాహనాల వేలంతో అరకోటికి పైగా ఆదాయం



భారీగా పట్టుబడిన కర్ణాటక మద్యం (ఫైల్)



పట్టుబడిన మద్యాన్ని రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అక్రమ మద్యాన్ని అరికట్టడంపై దృష్టి సారించింది. అందుకుగానూ ప్రత్యేకంగా సెబ్(స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూ రో)ను ఏర్పాటు చేసింది. అక్రమ మద్యంపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. నాటుసారా స్థావరాలపై దాడులు జరిపి ఊటలను ధ్వంసం చేయడమే గాకుండా సారాను స్వాధీనం చేసుకుని తయారీదారులపై కేసులు నమోదుచేస్తున్నారు. పొరుగు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వస్తున్న లిక్కర్‌ను పట్టుకొని అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో 420 కేసులు నమోదు చేసి 538 మందిని అరెస్టు చేశారు. ఇందులో 118 వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.63,50,208 ఆదాయం చేకూరింది.

నాటుసారా స్థావరాలపై దాడులు

గతేడాది నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 24 మందిని అరెస్టు చేసి 5,650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 231.2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక లిక్కర్ పట్టివేత

అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న 514 మందిపై కేసులు నమోదు చేసి 9,331 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 118 వాహనాలను సీజ్ చేశారు.

కేసుల నమోదు

ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న మొత్తం 174 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరిలో నిబంధనలు అతిక్రమించిన వారిలో 41 మందిపై అదనంగా కేసులు నమోదు చేశారు. వీరి నుంచి రూ.5,43,000 జరిమానా వసూలు చేశారు. అలాగే విరుపాపురం గ్రామంలో పొలం కలిగిన ఆస్పరి మండలం చిగిళికి చెందిన బోయ రామంజిని గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి 41 మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు.


వాహనాల వేలం ద్వారా ఆదాయం

2022-23 వివిధ కేసుల్లో సెబ్ అధికారులు పట్టుకున్న 338 వాహనాలను జిల్లా ఉన్నతాధికారులు వేలం వేశారు. ఇందులో ఐదుగురు ప్రభుత్వానికి జరిమానా చెల్లించి తమ వాహనాలను తీసుకున్నారు. మిగతా వాహనాలను వేలయం వేయగా రూ.63,50,208 (జీఎస్టీతో కలిపి) ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

రూ.కోటిన్నర విలువైన సరుకు ధ్వంసం

కర్ణాటక మద్యానికి సంబంధించి మొత్తం 686 కేసులు నమోదుకాగా 20,727 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ కర్ణాటకలో రూ.80,90,509గా ఉంది. అదే మద్యం విలువ ఆంధ్రప్రదేశ్‌లో రెండు రెట్లు ఎక్కువగా ఉంటుంది. అక్రమ మద్యాన్ని సెబ్ అధికారులు రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. అలాగే 145 నాటుసారా కేసులకు సంబంధించి 1854 లీటర్ల సారా ధ్వంసం చేశారు.

విస్తృతంగా దాడులు జరుపుతున్నాం



విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎప్పటికప్పుడు విస్తృతంగా దాడులు జరుపుతున్నాం. 2022-23లో రూ.కోటిన్నర విలువ గల అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశాం. జిల్లాలోనే అత్యధికంగా ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చింది. దాదాపు 90 శాతానికి పైగా గ్రామాల్లో నాటుసారా విక్రయాలు తగ్గిపోయాయి. కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నాం. - హరికృష్ణ, ఆదోని సెబ్ సీఐ

శ్రీమఠానికి విరాళం

మంత్రాయలం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలోని గోసంరక్షణ కేంద్రానికి బెంగళూరుకు చెందిన సలీమ్ రూ.లక్ష, వెండి రథోత్సవానికి రూ. 50 వేలు శుక్రవారం విరాళంగా అందజేసినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు తెలిపారు. అంతకు ముందు దాత గ్రామ దేవత మంచాలమ్మను, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు ఫల మంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

రేపు ప్రవేశ పరీక్ష

ఆదోని రూరల్ : ఈనెల 16వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్ష పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, కేజీఎస్ ఫంక్షన్ హాల్ పక్కనున్న ప్రభుత్వ బీసీ కళాశాల కాలేజీ వసతి గృహంలో నిర్వహిస్తున్నట్లు పరీక్ష సూపరింటెండెంట్ సి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను, ఎగ్జామ్ ప్యాడ్, హాల్ టికెట్, ఆధార్‌కార్డుతో పరీక్షా కేంద్రానికి అర గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని, పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు అనుమతించమని చెప్పారు. హాల్ టికెట్ రాని విద్యార్థులు దరఖాస్తు సమయంలో ఉన్న అక్‌నాలెడ్జ్‌మెంట్ కార్డు, ఫొటో, ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. వివరాలకు సెల్ 9110596480 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.